

# వాళ్లు ముగ్గురేనా?

విమల

“పులి మీదికెక్కి సవారిజేసుడు రాకుంటె, దాని ముంగటి కెందుకు పోవాల్నంట. నిన్ను జూసి అది అయ్యో పాపం అని దయదల్చి తినకుంట ఊకుంటద.” మసాజ్ టేబుల్ పై పడుకుని కళ్లు మూసుకున్న చిత్రకళ ఈ మాటలకి కళ్లు తెరిచి చూసింది.

యాదమ్మ చేతివేళ్లు చిత్రకళ వంటిపై, తమాషాగా నాట్యం చేస్తుండగా, నోటి నిండా పాన్ నములుతూ, కొంచం గమ్మత్తుగా అందీ మాటలు. ఈ మాటలే కాదు వాటి కన్నా ముందు ఆమె అప్పుడప్పుడూ చెబుతూ వుండే సరస జీవితం కూడా ఆమెనీమధ్య నిలవ నీయడం లేదు. ఆ మసాజ్ టేబుల్ పై గంటో గంటన్నరో అట్లా వళ్లంతా క్రీము పూసిన శరీరాన్ని ఆమెకి అప్పగించాక, ఆమె చేతి వేళ్ల భాషనే కాదు, ఆమె మాటల హోరును కూడా విని మెల్లిగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది చిత్రకళ.

“యాదమ్మా! ఇట్లానే అందరితో మాట్లాడుతుంటావా?” అడిగిందోసారి.

“అందరు నీ లెక్కనే వుంటర? నేను జెప్తున్న. నువ్వింటున్నవ్. నా మాటలు నీకు సమజవుతున్నయి గాబట్టే నాకుబీ చెప్పబుద్ధయితది,” అంది.

వట్టిమాటలే కదా అనుకుంటాం కానీ, మనకేం సంబంధంలేని మాటలు కూడా మన అంతరాంతరాళాల్లో కెళ్లి, మనల్ని కల్లోల పరుస్తాయి.

దాదాపు నాలుగేళ్లుగా ఆ జిమ్‌కి క్రమం తప్పకుండా వస్తుంది చిత్ర. దాన్లోనే వుండే స్పాలో తన అందానికి మెరుగులు దిద్దుకోవటంతో పాటూ, మసాజ్ చేయించుకుంటుంది. అందుకేనేమో ముప్ఫైఏడేళ్ల వయసులోనూ, ఇంకా యవ్వనపు మెరుపు ఆమెలో తగ్గలేదు.

యాదమ్మలోనూ ఏదో తెలీని ఆకర్షణ వుందనుకుంటుంది చిత్రకళ. రెండు చేతులకీ నిండుగా మట్టి గాజులు, చెవులకి పెద్ద దిద్దులు, ముక్కుపుడక, కాళ్లకి గంటీలు, గోళ్లకి రంగు, అరచేతుల్లో అప్పుడప్పుడు ఎర్రటి గోరింటాకు, మధ్యమధ్య మెరిసే తెల్ల వెంట్రుకలతో ముడేసిన వత్తయిన జుట్టు, చామనచాయ రంగు, వయసుతో పాటూ పెరిగిన శరీరపు బరువు, కళకళలాడే నవ్వు మొఖంతో పలకరించే యాదమ్మ, సూటిగా, జంకు గొంకూ లేకుండా మాట్లాడటం చిత్రకళకి ఎప్పటికప్పుడు కొత్తగానే వుంటుంది. ఆమెలా తను మాట్లాడగలదా, ఆమెలా, ‘నా జీవితం నా ఇష్టం మీకెందుకని,’ అనగలదా?

యాదమ్మ మొన్నామధ్యే కొడుక్కి పెళ్లి చేసింది. వెంటనే కొడుకునీ, కోడల్నీ వేరు కాపురానికి పంపింది.

“అదేం, నీకొక్క కొడుకే కదా!” అంది చిత్ర కొంచం ఆశ్చర్యంగా.

“గా రెండు అర్రల ఇంట్ల, తల్లి ముంగట పెండ్లాంతో సరసమేం జేస్తడు. అత్త ఆరడి బెడ్తదన్న నింద నాకెందుకు. కిందబడ్డ, మీదబడ్డ ఎవరి సంసారం వాల్లు ఎల్లదీసుకొనుడు ఒక్క సిత్తం,” అంది యాదమ్మ. ఆ మాటొక్కటే అంటే చిత్రకళకి ఏమనిపించేది కాదు.

"నా కోసం నా ఇంటికొచ్చెటోడు నాకున్నడు. కోడలి పోరి ముందు నేనెందుకు నెత్తి దించుకొనుడు," అని కొంటెగా కన్నుగీటి నవ్వింది.

యాదమ్మది మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట దగ్గరి పల్లెటూరు. పురిటిలోనే ఐదారుగురు పిల్లలు చని పోయాక, లేక లేక పుట్టిన పిల్లేమో, చిన్నప్పుడు గారాబం గానే పెరిగింది. కూలిచేసుకు బతికే కుటుంబం కాబట్టి కాయకష్టం ఆమెకి కొత్తకాదు. యాదమ్మ పెళ్లినాటికే తల్లి దండ్రులిద్దరూ ముసలివాళ్లయిపోయారు. మరో కూలి వాడితో ఆమె పెళ్లయింది. అందరిలానే ఆమె కూడా భర్తతో పాటు, ఊరు విడిచి పనుల కోసం హైదరాబాద్ నగరానికొచ్చింది. అక్కడే కొడుకు పుట్టాడు. వాళ్లు పనిచేసే భవంతులవద్దే, రేకులు, ప్లాస్టిక్ పట్టాలతో కట్టిన షెడ్లలో ఆమె కాపురం సాగింది. తొమ్మిదో అంతస్తు వద్ద, మోకులు కట్టిన ఉయ్యాలపై కూర్చొని పనిచేస్తున్న యాదమ్మ భర్త ఎట్లా పడ్డాడో, కిందపడి అక్కడికక్కడే చని పోయాడు ఓరోజు. ఏడాది కొడుకును వొళ్లో వేసుకుని, గుండెలు అవిసేలా ఏడ్చింది. యాభయి వేలు నష్టపరి హారం చెల్లించి చేతులు దులుపుకున్నాడు కాంట్రాక్టరు. యాదమ్మ మళ్లీ తల్లిదండ్రుల దగ్గరికి చేరింది. ఇప్పుడు కొడుకుతో పాటు ముసలివాళ్లిద్దరినీ పోషించే భారం ఆమెమీదే పడింది. కూతురు బతుకు బండలైపోయిం దన్న దిగులుతో యాదమ్మ తండ్రి ఏడాది తిరక్కుండానే చనిపోయాడు. ఉన్న ఊర్లో బతుకులేక, ఊర్లోవాళ్లతో పాటూ ఆమె మళ్లీ వలసకూలీ అయింది. తట్టలు మోసింది. రోడ్లు ఊడ్చింది. ఇండ్లలో పాచి పనులు చేసింది. రోజుకూలీగా రాజకీయపార్టీల మీటింగుల కెళ్లింది. అట్లా అనేక పనులు చేసి, చివరికి ఎవరి కాళ్లో పట్టుకుని, ప్రకృతి వైద్యశాలలో ఊడ్చే పని సంపాదించు కుంది. కొన్నాళ్లకి మసాజ్ చేయడం నేర్చుకుని, చివరికి నెలజీతం సంపాదించుకునే ఉద్యోగస్తురాలైంది. గడ సరిగా, ఎప్పుడూ చలాకీగా, నవ్వుతూ వుండే యాదమ్మ గా మారే క్రమంలో ఏ ఆనంద విషాదాలు ఆమెలో ఏ పెనుతుపానులను సృష్టించి వుంటాయి?

*

"మంచి బందోబస్తుగుంటది పోరి. కష్టంజేస్తది. మొగోడు తోడు లేనిదే అది వుండుడు కష్టమనిపిస్తది," అంది సరస గురించి ఒకసారి యాదమ్మ. సరస తమిళ పిల్ల. కానీ తమిళయాసతో తెలుగు బాగానే మాట్లాడు తుంది. మద్రాసు నుండి తిరుపతికి వాళ్ల కుటుంబం వలస వచ్చింది. తండ్రి తోపుడుబండి పెట్టుకొని, ఇడ్లీలు, దోసెలు అమ్ముకుని సంసారం వెళ్లదీసేవాడు. తెగిన గాలిపటంలా ఎక్కడెక్కడ ఎగిరి, ఎక్కడెక్కడ తిరిగి వచ్చిందో కానీ ఎనిమిదేళ్ల క్రితం ఆమె యాదమ్మ వాళ్ల బస్తీ కొచ్చింది. పాతికేళ్ల యవ్వనంతో తళతళలాడుతూ హుషారుగా వుండే సరస, యాదమ్మ ఇంటి పక్కగది అద్దెకు తీసుకుంది. ఒకటి, రెండు గదులతో ఏడు పోర్షన్లు వుండే ఆ కాంపౌండులో సరస అందరి ఆకర్షణకీ కేంద్రమైంది. ఎత్తుచెప్పులు, చేతికి హ్యాండ్‌బ్యాగు గోళ్లరంగు, చెవులకి కొత్త కొత్త జుంకాలూ తగిలించుకుని ఏదో ఫ్యాక్టరీ లో డ్యూటీ చేసేందుకెళ్లేది. అద్దె వసూళ్లకి వచ్చే ఇంటి ఓనరుకి ఠంచనుగా అద్దె ఇచ్చేది. అందరితో కలుపుగోలుగా వున్నా తన గురించి ఎవరైనా అడిగితే మాట దాటేసేది. చేబదుళ్లనో, యాభయ్యో, వందో అప్పనో ఎవరైనా అడిగితే, అడిగిందే తడవు, కాదన కుండా ఇచ్చేది. గదిముందు రెండు గులాబీ పూల కుండీలు, గది తలుపుకు నీలం, తెలుపు పూలకర్టెను వేలాడే ఆ ఇంటి లోపల కూడా ఎంతో పొందికగా వుండేది. పనిపాటలు చేసుకు బతికే ఆ కుటుంబాల మధ్య ఆమె కాస్త భిన్నంగా వుండేది. అందుకేనేమో చుట్టుపక్కల వాళ్లు ఆమెపట్ల కాస్త ఆదరంగానే వుండే వాళ్లు. అందర్లోకీ యాదమ్మ దగ్గరే సరసకి ఎక్కువ దగ్గరి తనం, చనువు ఏర్పడ్డాయి. తల్లి చనిపోతే, తండ్రి వేరే పెళ్లి చేసుకున్నాడనీ, ఆ వచ్చినామె చాలా గయ్యాళిదనీ, నానా హింసలూ పెట్టేదనీ, కొన్నేళ్లు పిన్ని దగ్గరున్నాననీ, బాబాయి ప్రవర్తన మంచిది కాదనీ, అక్కడ వుండలేక, ఒక స్నేహితురాలి సహకారంతో, హైదరాబాద్ వచ్చానని యాదమ్మకి చెప్పుకుంది.

ఓ ఏడాది తరువాత, ఆమె వయసే వుండే ఒక అబ్బాయి ఆమె ఇంటికి రావడం ప్రారంభించాడు. వాళ్లిద్దరూ సినిమాలకీ షికార్లకీ తిరుగుతూ వుంటే యాదమ్మే ఓరోజు పెద్దమనిషిలా, 'పోరడు చక్కగున్నడు. ఇద్దరికి ఈడూజోడు కుదిరింది. పెళ్లి చేసుకోరాదు,' అంటూ సరసకి సలహా ఇచ్చింది. యాదమ్మ మాటలకి నవ్వి ఊరుకుంది సరస. కానీ, మరో మూడునెలలకి ఆ పిల్లవాడు సరస గదికే తన సామాన్లు పట్టుకొచ్చు

కున్నాడు. సరస మెడలో కొత్తగా పసుపుతాడు వచ్చి చేరింది. యాదమ్మే వాళ్లిద్దరినీ తనింటికి భోజనానికి పిలిచి, సరసకి చీర పెట్టింది. నిజం చెప్పాలంటే సరస కన్నా ఆ పిల్లవాడు అందగాడు. డిగ్రీ వరకు చదువు కున్నాడు. అతను అమలాపురం నుండి సినీ అవకాశా లను వెతుక్కుంటూ వచ్చాడని సరస చెప్పింది. ఆరు నెలల తరువాత అతని స్టూడియోలకి దూరమవుతుం దని అంటూ, వాళ్లు ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయారు. అయినప్పటికీ వీలు చేసుకొని అప్పుడప్పుడూ యాదమ్మ దగ్గరకి రావడమో, ఫోన్ చేయడమో చేసేది సరస. ఆ తరువాత మెల్లిగా ఆమెతో సంబంధాలు తెగిపోయాయి. దాదాపు ఏడాది తరువాత, మూడునెలల పసిబిడ్డని ఎత్తుకుని, యాదమ్మ ఇంటి కొచ్చింది సరస. పిల్లవాడికి పాలిస్తూ, ఏడుస్తుంటే, ఆమె కన్నీళ్లు వాడి నుదిటి మీదా, బుగ్గలపైనా పడ్డాయి. ఆమె ఎక్కువ వివరాలు చెప్ప కుండానే అర్థమైంది యాదమ్మకి. వాడు ఆమెని వదిలి పెట్టి వెళ్లిపోయాడని. ఎక్కడుంటాడో తెలియని వాడ్ని వెతకలేక, కనీసం ఆమె తండ్రి వివరాలన్నా చెప్పమని అందరూ కలిసి సరసని వత్తిడి చేశారు. 'నాకెవ్వరూ లేరు' అంటూ, గుండెలు పగిలేలా ఏడుస్తున్న సరసని ఓదార్చటం ఎవరి తరం కాలేదు.

పాత సామాన్లు పెట్టుకునే తడికెల పాకని శుభ్రం చేసి, సరస వుండేందుకు చోటు కల్పించాడు ఇంటి ఓనరు. చుట్టుపక్కల వాళ్లంతా తలా కాస్త చందాలేసు కుని, అద్దె కట్టి, రెండు, మూడు నెలలకి సరిపడేలా బియ్యం, పప్పులు కొనిచ్చారు. సరస తన మెడలో పసుపుతాడుకు వేలాడుతున్న బంగారపు మంగళ సూత్రపు బిళ్ల ఇస్తే, పక్కింటివాళ్లు అమ్మిపెట్టి, ఆమె చేతిలో డబ్బులు పెట్టారు. ఇప్పుడా కాంపౌండులో సరసకి ఇంతకుముందులా ప్రత్యేకమైన గుర్తింపేమీ లేదు. పగిలి నెర్రలుబారిన పాదాల గురించి, మట్టిచేరిన వేలిగోళ్ల గురించి పట్టించుకునేంత తీరిక ఆమెకి లేదు. ఇప్పుడా ఇంటి వాకిలికి నీలం పూలకర్టెన్ వేలాడటం లేదు. పూలకుండీల ఊససలే లేదు.

యాదమ్మ తనకు తెలిసిన మేస్త్రీతో మాట్లాడి, తట్టలు మోసే పని ఇప్పిచ్చింది. కానీ ఆ పని ఎక్కువ కాలం చేయలేక, ఇళ్లలో పాచి పనులు, వెతుక్కుంది. కొడుకు మూడేళ్ల వాడయ్యాడు. సరస జీవితం కాస్త తెరిపిన బడ్డట్లయింది.

" ఉప్పుకారం తిన్న శరీరమాయె. ఊకోమంటే అది ఊకుంటద? శివసత్తులు సిగమూగినట్లు, వయసు మనల దుంకులాడిస్తది," అంది యాదమ్మ. అట్లా ఆమె, సరస దుంకులాడిన వైనాన్ని, చిత్రకళకి తమాషా గా చెప్పిందొకసారి.

*

ఆవిరి పొగలు కక్కుతున్న అద్దాల గదిలో కూర్చుని స్టీమ్‌బాత్ చేస్తున్న చిత్ర, తన అర్ధనగ్న శరీరం వైపోసారి చూసుకుంది. దేహం అంటే ఏమిటి? దాని చుట్టూ ఇంతమంది పొగవుతారెందుకు? మనసెందుకు ఎప్పుడూ, గాలిలో పెట్టిన దీపంలా రెపరెపలాడుతుం దెందుకు? దేహమూ, బుద్ధి, మనసు మనిషి జీవించి నంత కాలం ఎన్నడూ కలవని సమాంతర రైలుపట్టాల్లా సాగుతాయనిపిస్తుంది చిత్రకి.

ఈ అందమైన వంపులు తిరిగిన శరీరాన్నీ, మనసును, చురుకైన బుద్ధినీ తన స్వాధీనం లోకి తెచ్చు కునేందుకు తను ఎలా ప్రయాసపడేదో గుర్తుకొచ్చింది చిత్రకి. శరీరాన్ని అందంగా, ఆరోగ్యంగా వుంచుకోవడం, పెదవులపైన చిరునవ్వును ఎన్నడూ చెదరనీయక పోవడం, కించిత్ విసుగు, దిగులు, విషాదాలు, ఏవీ కూడా ముఖంపైన కనబడనీయకపోవటం, చలాకీగా, ఆకర్షణీయంగా మాట్లాడటం- ఇవన్నీ, అనేక ఏళ్లుగా కృషిచేసి సాధించిన విద్యలు. తన ఆలోచనలు ఇప్పుడెం దుకో నియంత్రించలేని నయాగారా జలపాతంలా లోలోపల ఎగిసిపడటాన్ని గమనిస్తోంది చిత్ర.

ప్రకాశం జాల్లా ఉప్పుగుండూరులో పదోతరగతి వరకూ చదువుకుంది చిత్ర. తండ్రి, ఓ స్కూల్లో డ్రాయింగ్ టీచరుగా పనిచేస్తూ, ఆ జీతం చాలక మరో స్నేహితుడి తో కలిసి, పెళ్లిళ్లలో వీడియోలు తీస్తూ వుండేవాడు. ఎంసెట్ కోచింగ్ కోసం, విజయవాడలో ఓ పేరున్న కోచింగ్ సెంటర్‌లో చేర్పించాడు. ఇంజనీ రింగులో సీటు సంపా దించి, ఏ అమెరికాకో వెళ్లి బాగా సంపాదించాలనీ, అలా తమ ఆర్థికస్థితి మెరుగు పడాలనీ, తల్లి ఆశ పడేది. నిరాడంబరత్వం, ఆదర్శాలు మాట్లాడే నెమ్మదైన తండ్రిని తల్లి ఎప్పుడూ ఈసడిస్తూ మాట్లాడుతుండటం చిత్ర మీద కూడా ప్రభావాన్ని

చూపించింది. అతని చాతకానితనం వల్లే, పెదనాన్నలు తాతగారి ఆస్తి తమకి దక్కనివ్వలేదని, తల్లిలా ఆమె కూడా అనుకునేది. విజయవాడలో తనతో పాటూ చదువుకుంటున్న డబ్బున్న అమ్మాయిల్ని చూస్తే, చిత్ర కళకి లోలోపల ఈర్ష్యగా అనిపించేది. మొదట్లో గుర్తించ లేదు కానీ, వాళ్లకు లేనిది, తనకున్నది అందం అని నెమ్మదిగా తెలుసుకుందామె. డబ్బుంటే ఆ అందానికి మరిన్ని మెరుగులు దిద్దుకోవచ్చని, అందాన్ని కూడా పది మందీ గుర్తిస్తారని, తల్లిదండ్రుల అదుపాజ్ఞలు లేకపోతే, చాలా స్వేచ్ఛగా వుంటుందని తెలుసుకున్న ఆ రెండేళ్ల విజయవాడ హాస్టల్ జీవితమంటే ఆమెకి ఇప్పటికీ ఇష్టమే. ఇరుకు ఇరుకుగా, పొదుపుగా, భయం భయం గా, అన్నిటికీ కటకటలాడుతూ బతికే తన ఇంటి పరిస్థితి చిత్రకి ఎప్పుడూ నచ్చేదికాదు. ఆమె ఆలోచనల్లో కొంచం వికాసం వచ్చిందేమో కానీ, ఎంసెట్ పరీక్షల్లో ఆమె చివరాఖరికి చేరుకుంది. ఎట్టి పరిస్థితుల్లో సీటు రాదని అర్థమయ్యాక, అనవసరంగా డబ్బులు ఖర్చు పెట్టించావన్న తల్లి సాధింపుల్ని భరించలేక, ఇక చచ్చినా మరోసారి ఎంట్రన్స్ పరీక్ష రాయనని మొండికేసి, ఒంగోలులో బి.కామ్‌లో చేరింది. చదువు పూర్తికాగానే, ఆరువేలకి ఎకౌంటెంటుగా హైదరాబాదులో ఉద్యోగం సంపాదించుకొని, ఇంట్లో వెళ్లద్దని అన్నా వినకుండా వచ్చేసింది. అమీర్‌పేటలో ఓ లేడీస్ హాస్టల్లో చేరింది. దగ్గర్లోనే వున్న ఒక కంప్యూటర్ సెంటర్‌లో తన రూమ్మెట్‌తో పాటు చేరింది. ఇరుకు గదుల్ని, సామాన్లని, చిరుతిళ్లనీ, అప్పుడప్పుడూ దుస్తుల్ని హాస్టల్ మిత్రులతో పంచుకుంటూ, కొత్తకొత్త కలల్ని వెతుక్కుంటూ, కొత్త జీవితాన్ని ప్రారంభించింది చిత్ర. రకరకాల అమ్మాయిలు. చిత్రకళలానే కొంచం అమాయకంగా, మరెంతో ఆశగా జీవితంలో పైకెదగాలన్న కలలతో బయలుదేరినవాళ్లు. వలలను, నిచ్చెనలను తయారుచేసుకోవడం నేర్చుకున్నవాళ్లు వాళ్లలో కొందరే. తనలానే వుండే కొందరమ్మాయిలు కొంతకాలం గడిచాక ఖరీదైన దుస్తులు, సెల్ ఫోన్‌లతో, విలాసవంతగా వుండటం, వాళ్లకోసం వీధి మలుపుల వద్ద మగపిల్లలు నిలబడటం, వాళ్ల వెనుక మిగిలిన అమ్మాయిలు చెవులు కొరుక్కోవడం చిత్రకళ గమనించింది. అలా తనకి బాగా దగ్గరైన తన రూమ్మేట్ సునీత గురించి కూడా, గుసగుసలుండేవి. తనతోపాటు మొదటిసారి కొన్ని పార్టీలకి వెళ్లినప్పుడు, అక్కడికొచ్చిన వాళ్లలో ఎక్కువమంది ఇంగ్లీష్‌లో మాట్లాడుకోవడం, మంచినీళ్లు తాగినంత సహజంగా అందరూ మద్యం తాగటం, సిగరెట్లు కాల్చటం మొదటిసారి చూసింది చిత్రకళ. అలాంటిచోట కూడా తన అందం తనకో గుర్తింపునిస్తోందని ఆమె గుర్తుపట్టగలిగింది. అందంతో పాటు చొరవ, చుట్టూ జరుగుతున్న విషయాలు, కొంచెం పుస్తకాలు, సినిమాల వంటివాటి గురించి తెలియడం, ముఖ్యంగా ఇంగ్లీషు బాగా రావడం అవసరమని అనుకుందామె. జీవితంలో ఆర్థికంగా ఎదగటానికి మనకున్న అందం, శరీరం సాధనమైతే అందుకు చింతించాల్సిన అవసరమేమీలేదని ఆమెని ఒప్పించగలిగింది సునీత.

'ఒకటి పొందాలంటే, మరొకటి కోల్పోక తప్పదన్న,' కొత్త సత్యాన్ని కనుగొన్న విభ్రాంతితో, లెక్కలేనితనంతో గడిపే కొందరు అమ్మాయిల జాబితాలో ఇప్పుడు చిత్రకళ కూడా చోటు సంపాదించుకుంది. 'శరీరానిదేం వుంది. కొద్ది నిమిషాలు నీవి కావనుకుంటే సరి,' అందామె స్నేహితురాలు ఓసారి. అట్లా అనుకోవడానికి చిత్రకి నాలుగేళ్ల కాలం పట్టింది.

*

స్నానం ముగించి, అక్కడే తయారయి బయట కొస్తుంటే, చల్లటిగాలి తగిలి శరీరం ఎంతో తేలిగ్గా అనిపించింది. మాదాపూర్ దాటుతుండగా హఠాత్తుగా పెద్దపెద్ద చినుకులతో వాన మొదలైంది. కారు కిటికీ అద్దాల మీద జారుతున్న వర్షపు చినుకుల్ని చూస్తుంటే గుర్తొచ్చింది. నోవాటెల్‌లో రాత్రి వెళ్లవలిసిన డిన్నర్. సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వచ్చే అలాంటి పార్టీలను ఆమె ఎప్పుడూ మిస్‌కాదు. కానీ ఈరోజెందుకో ఎక్కడికీ వెళ్లాలని లేదామెకి. దిగులు దిగులుగా, దు:ఖం బయటకు రాకుండా లోన లుంగలు చుట్టుకుంటూ...

యాదమ్మ మాటలు గుర్తొచ్చాయి.

'పులిని తను నిజంగా స్వారీ చేయగలిగిందా? కనీసం అది తనని పూర్తిగా తినేయకుండా చూసుకోగలిగిందా? లేకపోతే తన జీవితం కూడా సరస జీవితంలానే అవుతుందా?' ఈ తలపుకు ఒక్కసారిగా ఉలిక్కిపడింది చిత్రకళ.

మనిషి లోపలి కోర్కె బహుశా, పురాతనమైంది కావచ్చు. అదుపులేని శరీరానికి ఎన్నెన్ని అడ్డుకట్టలో.

అయినా అది గట్లు తెంచుకు పారే నదిలా ప్రవహిస్తుంది. యాదమ్మ అన్నట్లు అది శివాలెత్తుతుంది. అలా శివాలెత్తిన సరస జీవితం ఏమయింది.

“సరస కూలికి బోయినప్పుడు, గాడామెకొక మేస్త్రీ గానితో సోపతైనది. ఆడు అప్పుడప్పుడు పైసలిచ్చెటోడు. దానితో తిరుగుడు బెట్టిందీ పోరి. వానికి పెండ్లాం బిడ్డలున్నరు. ఎన్నటికన్న నిన్ను ఇడిసిపెడతడే దేడ్‌దిమాక్ దాన, ఇంక చిన్నదానివే. ఇంకెవలనన్న జూసుకుని, పెండ్లి జేసుకోవే అని ఎంత చెప్పిన ఇన్నదా అది,” అంది యాదమ్మ.

సరసకీ, తనలాంటి వాళ్లకీ, ‘నీ తాలూకు గతంతో నాకు పనిలేదు. ఇప్పటి నువ్వు మాత్రమే నాకు కావాలి. నిన్ను ప్రేమించాను. మనం పెళ్లి చేసుకుందాం,’ అనే వాడు ఎక్కడ దొరుకుతాడు. శరీరపు కోర్కె తీర్చుకునే ఆటకీ, పెళ్లనే ఆటకీ, బహుశా వేరువేరు సూత్రాలు, నిబంధనలూ వుంటాయి కామోలు అనుకుంది చిత్రకళ.

సరసకి ఒక కాలేజీలో ఊడ్చే పని దొరికింది. పొద్దుట ఇళ్లలో పని చేసుకుని, కాలేజీ పనికెడుతుంది. కొత్తగా జర్దా అలవాటైంది. రోజూ వండుకునేందుకు బద్ధకిస్తుంది. చేతిలో డబ్బులుంటే బిరియానీ పొట్లం తెచ్చుకుంటుంది.

“గట్ల డబ్బులు ఆగం చేయకు. పోరడున్నడు. పానం బాగలేన్నాడు కర్సుల కన్నా అస్తయని అంటే, రేపటి సంగతి రేపు. రేపటికి బతికుంటమో సస్తమో? ఎవలకి ఎర్క అనేది,” అంది యాదమ్మ

సరసకి అంతకు ముందున్న శుభ్రత, పొందిక ఎక్కడ పోయాయో తెలీదు. గట్టిగా మాట్లాడుతూ, నీళ్ల దగ్గరో, ఉమ్మడి స్నానాల గదుల వద్దో, ఇరుగు పొరుగు వాళ్లతో తగాదాలు పెట్టుకుంటూ చివరికి, ‘అమ్మో, దాని జోలికి పోవద్దమ్మ,’ అన్నట్లు తయారైంది. ఒక్క యాదమ్మంటేనే, కాస్త భయమూ, భక్తీ రెండూ వున్నాయా పిల్లకి.

“ఎట్ల దాచిపెట్టిందో పెట్టిందమ్మ. ఐదోనెల కడుపు, జర ఎత్తుగ కనపడబట్టె. ఏందే సరస, గట్లున్నవ్. అంటె సప్పుడు జేయలే. అదేం సిత్రమోగాని కక్కుడన్న మాట లేకుండె దానికి. ఒకపారి, నేనే దాన్ని బెదిరించిన. అప్పుడొప్పుకున్నది. ఎన్నో నెలనే అంటె తెల్వదంటది. దావఖానకు బోలె. పరీక్ష సేయించుకోలే. నేను తోల్కపోత, పోదం రాయే అంటే, నేను రానుపొమ్మని జిద్దు జేసింది. మా వాడకట్టు పెద్దమనుష్యులంత పోగయ్యిన్రు. కడుపు జేసినోని పేరు జెపితే, వాన్ని గుంజుకొస్తం అన్నరు. ఈ పోరి నోరిప్పలే. ఒకని తానికే బోతె ఎర్కయితి. ఇది ఎందరి తానికి బోయిందో అన్నరు గా పెద్ద మనుష్యులు. మా అందరికి తిట్టి తిట్టి యాష్టకచ్చిన గాని, అది నోరిప్పలే. కాన్పు ఎప్పుడైతదన్నది కూడ దానికి ఎర్కలేదు.

“సరస రోజూ పనికి వెడుతూనే వుంది. ఆమెను పట్టించుకునేంత తీరిక, బాధ్యత అక్కడ ఎవరికీ లేదు.

“ఏనిమిది గంటల రాత్రి, దాని ఇంటి గలమకాడ కూసోని ఓ అక్కో నొప్పు లొస్తున్నయి. నాకు వశపడ్తలేదు అంట, ఏడ్సుడు, వొర్లుడు షురుజేసింది. అందరు జేరిసూస్తున్నరు. మా వాడల పెద్దమనిషి, ‘కట్టుదప్పిన బాడుఖావ్. దానితానికి ఎవలు పోకుండ్రి,’ అన్నడు. ఎవరిండ్లల్లోకి ఆల్లు బోయిన్రు అందరు. పన్నెండు గంటల రాతిరి, దాని కొడుకు ఏడ్చుకుంట మా తలుపు కొట్టబట్టిండు. ఆడజన్మమంత అన్యాలం లేదమ్మ. నేను ఉర్కిన. నేనుబోయెతల్కి, నేల మీద పడుండుకోని లాసిగ వొర్లుతున్నది. గసబెడుతున్నది. దాన్ని చూసెతలికి, నాకు సల్లసెమటలు బట్టినయి. ఏమైతె గదైతది తీయని, మా వాడకట్టు నుండేటి, మంత్రసానిని తోల్కొచ్చిన. పక్కింట్ల కెల్లి ఇంకొక దయగల అమ్మగూడ సాయానికొచ్చింది. దావఖానకు తీస్కపోనీకి టయం లేకుండె. బిడ్డ బయటకచ్చిండు గని, మాయ బయట పడలె. ఇదేందిర దేవుడ. లేనిపోనిది నెత్తిన బెట్టుకున్న. పెద్దపానానికే ముప్పు అస్తదేమో, దేవ అని గజ్జగజ్జ అనికిన. ఆ బగమంతుని దయ తల్లీ! మొత్తం మీద గండం గడిసింది. పిండం బయటవడ్డది తల్లి.

“నేను ఇంటికొచ్చి వేడినీళ్లతో తానం చేసేతలికి పొద్దుగాల నాలుగైంది. మంత్రసాని చేతిలో మూడొందలు పెట్టి, నా పాతచీరెలు రెండిచ్చి సాగనంపిన. నెత్తుటి మరకతో, నీసుకంపు కొడుతున్న గా యింట్లకి మల్లీ పొద్దుగాల నేను తప్ప, ఎవలూ తొంగి చూడలె. హోటల్ నుండి ఇడ్లీలు తెప్పించిన. ఇంట్ల టీ చేసుకొని సరస గుడిసెలోకి పోయేతలికి నెత్తుటి మరకలంటిన గచ్చు మీన నీళ్లు వోసుకుని కడుక్కుంటన్నరు సరస, దాని

కొడుకు. పాత నూలుచీరెలో చుట్టిన పసిబిడ్డ, గా గది లోనే ఓమూల ఆదమరిసి నిద్రపోతున్నడు. తానానికి నీళ్లు పెట్టుకున్నట్లున్నది. స్టవ్ మీద అవి సలసలా మరుగుతున్నయి.

"నీది పచ్చివళ్లే. రెండురోజులు నేనే వండిపెడత నన్న యినలేదది. ఇంటి కిరాయి రెండు నెలల సంది కట్టలేదని కొట్లాడేందుకొచ్చిన ఇల్లుగలాయన దాని గతి జూసి ఏమనలేక గమ్మునున్నడు. చుట్టుముట్టోల్లం దరం, తలా ఇన్ని పైసలేసుకుని, దానికిచ్చినం. ఏడ్చు కుంటనే తీసుకున్నది.

"కడుపు జేసినోడు కాన్పు కర్సులకన్నా ఇచ్చినోడు గాదు. కంసేకం దావఖాన కర్సులన్నా ఎల్లేటివి గాదా అన్నరు సుట్టుముట్టోల్లు. సంపి సావుకర్సులకి ఇస్తగానీ, ఊకోమన్నట్లున్నది యవ్వారం," అంది యాదమ్మ.

యాదమ్మకున్న తెలివితేటలు, ధైర్యం సరసకి లేవనుకుంటాను అనుకుంది చిత్ర.

రెండోసారి నగరానికొచ్చిన యాదమ్మ వెంట ఇప్పుడు ఆమె తల్లి, నాలుగేళ్ల కొడుకు వున్నారు. వాళ్లను పోషించే భారం ఆమెదే. ఆడపని, మగపని అని లేకుండా ఏ పనైనా ధైర్యంగా చేయటం అలవాటైంది. ఒకసారి కూరల మండీలో పనికిపోతే, ఊర్లనుండి కూరగాయలు ట్రాక్టర్లో వేసుకొచ్చే, ఒక డ్రైవరుతో స్నేహం కుదిరింది. శరీరం మరింత దగ్గరితనాన్ని కోరుకుంది. ఆమె అక్కడ పని మానేసినా వాళ్లు కలుసుకుంటూ వుండేవాళ్లు. అతనేమీ ఆమెకి పెళ్లి చేసుకుంటాన్నా హామీలివ్వలేదు. తను గర్భవతినయ్యానా లేదా, అని ఆమె సందేహపడుతున్న కాలంలోనే, తట్టమోస్తూ, మెట్లెక్కబోయి కళ్లు తిరిగి, జారిపడింది. గర్భస్రావమయి వారంపాటు ఆసుపత్రిలో వుండాల్సి వచ్చింది. తల్లి ముందు, బంధువుల ముందు దోషిగా నిలబడాల్సి వచ్చింది.

"పోరగాన్ని ఎవలకన్న సాదుకునేందుకిచ్చి, మల్ల పెండ్లి జేసుకోయే అంటె ఇనలేదానాడు. నాకొడుకుని నేనే సాదుకుంటనని పట్టుబడితివి. ఇప్పుడు లేనిపోని కతలు జేయవడ్తివి. అంత ఒపలేకుంటే ఎవన్నోకన్ని మేమే జూస్తుండె," అని తిట్టారంది యాదమ్మ. ఆమెతో ప్రేమగా మాట్లాడి, ఆమె శరీరాన్ని కోరుకున్నవాడు ఆమె అట్లా నలుగురి ఎదుటా అవమానపడుతుంటే ఆమె పక్కన లేడు. అప్పుడే కాదు, మరెప్పుడూ అతడామెకి కనపడలేదు. నా జీవితంలో ఏ కష్టవచ్చినా ఎవరినీ చేయిచాచి సాయమడగనని అప్పుడే యాదమ్మ నిర్ణ యించుకుంది. కొడుకును బడిలో చేర్చింది. మరో మూడేళ్లకి తల్లి చనిపోయింది. మరికొన్నేళ్ల వరకూ ఆమె జీవితంలోకి ఏ మగవాడూ ప్రవేశించలేదు. పేదవాళ్లకి ఇండ్ల పట్టాలిస్తున్నారంటే, బస్తీవాళ్లతో కలిసి, ఓ గల్లీ లీడర్ నర్సింహని కలవటానికెళ్లింది యాదమ్మ. రేషన్ కార్డు, ఫోటోలు, దరఖాస్తులు అంటూ అతని చుట్టూ, మండలాఫీసుల చుట్టూ, నెలల తరబడి తిరగాల్సి వచ్చింది. కలెక్టరాఫీసు ముందు అందరితో పాటూ ధర్నాకి కూర్చుని తన్నులు కూడా తింది. ఉండేందుకు తనకంటూ ఒక చోటుంటే ఎలాగోలా బతకచ్చన్న ఆశ ఆమెది. చివరికి ఆమెకి ఇళ్లపట్టా శాంక్షనయింది. దానితో పాటూ నర్సింహతో పరిచయం కూడా పెరిగిందామెకి. ఎన్నికలు, ప్రచారాలు, బహిరంగసభలంటూ బయటి ఊర్లకి రమ్మని ఆమెని పిలిచేవాడు. అట్లా ఒకటి రెండు సార్లు యాదమ్మ, ఢిల్లీలో జరిగిన మీటింగులకు కూడా వెళ్లింది. ఈ తిరగటాలు, కొత్త పరిచయాలు, చుట్టు పక్కల వాళ్లలో ఆమెకొక గుర్తింపును తెచ్చాయి. ఆపనీ, ఈపనీ చేసిపెట్టమనీ, సలహాలనీ ఎవరో ఒకరు ఆమె దగ్గరికి వచ్చేవాళ్లు. నర్సింహతో ఆమె సంబంధం బహి రంగమే. పదేళ్ల కొడుకుని పెంచి పెద్దచేసి, ప్రయోజకుడ్ని చేయడం తన పననుకుంది యాదమ్మ. ఆమె అతడ్ని పెళ్లి చేసుకోమని ఎన్నడూ ప్రాధేయపడలేదు. అతనే ఓ సారి ఆ ప్రస్తావన తెస్తే,

"ఇయ్యాల బాగనే వున్నవు. రేపు నీకో పోరన్నో, పోరినో కంట. అటెన్క, నీ బుద్ధి తిరిగి, నాకు పెండ్లాం, బిడ్డలున్నరు, ఇగ నీతో కాపురం చేయలేనే యాదమ్మ అన్నవనుకో, నా గతి ఏంగావాలె. ఉన్నొక్క కొడుకును సాదలేకనే, నా బతుకిట్లయ్యె. ఇంకొక బిడ్డ నా మెడ లెందుకయ్య. నీ పెండ్లికి, నీకో దండమయ్య సామి," అంది యాదమ్మ.

అతనొకసారి, నీ ఖర్చులకు డబ్బులు నేనిస్త. పని మానేయమన్నప్పుడు యాదమ్మ కస్సుమంది.

"నా తిండి నేను సంపాదించుకుంట. నా పోరన్ని నా రెక్కలకష్టం మీద సాదుకుంట. నా యింట్ల నేను బాజాప్త పంట. పని బందుపెట్టి, రేపటికెల్లి, కుక్క తీర్గ,

నువ్వెన్నడు బొచ్చల కూడేస్తవో అన్నట్లు ఎదురు సూడాల్నా? నువ్వు జూజూ అని బుదగరిస్తే, తోకూపు కుంట నీ దగ్గరికి రావలె. నీకు కోపమెచ్చి నీ యెడ్మ కాలితో లాసిగ ఒక్క లాత్ తన్నితే ఏడ్చుకుంటబోవాల్నా? ఎవరిమీద ఆధారపడి బత్కదీ యాదమ్మ. నెలల పోరన్ని, నడుముకు గట్టుకుని ఒక్కదాన్ని ఎద్దోలె కాయకష్టం జేసిన, ఏమనుకున్నావో. చూసినవా ఈ సేతులు, నా సేతులు ఎట్లున్నయో?'' అంటూ నిటారుగా నిలబడి, రెండు అరచేతుల్నీ అతని ముందుకు చాచింది. అతను మరింకేం మాట్లాడలేదు.

*

చిత్రకళ తన పొట్టకేసి చూసుకుంది. చదునుగా, చిరుబొజ్జ కూడా లేదు. వంపు తిరిగిన నడుం కింద చీర మడతల వెనక దాగిన పొట్టపైకి ఆమె చేతివేళ్లు పాకాయి. కొన్నేళ్లు గడిస్తే పిల్లల్ని కనగలిగిన శక్తి కూడా తనకి లేకుండాపోతుందేమో? తనకి పిల్లలుంటే బావుం టుందా? ఏమో? అప్పుడప్పుడూ వాళ్లతో కబుర్లు చెప్పటం, ఆడుకోవడం బాగానే వుంటుంది. పిల్లల్ని కనగల శక్తి ఆడవాళ్ల శరీరాలకి వున్నా, కనాలంటే మాత్రం తప్పకుండా పెళ్లిచేసుకోవల్సిందేనా?

తన జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకోవడం మొదలుపెట్టాక, ఇంట్లోవాళ్ల నుండి చాలానే ఘర్షణల్ని ఎదుర్కోవలసి వచ్చింది చిత్ర. కొంతకాలానికి వాళ్లు తనను, తను వాళ్లని వదిలేసుకునేదాకా వచ్చాక, ఇక కూతురే లేదని వాళ్లు నిర్ణయించుకున్నారు. కానీ చిత్ర పూర్తిగా అలా అనుకోలేక అప్పుడప్పుడూ అందరూ గుర్తొచ్చి బాధపడుతూ వుంటుంది.

''ఆట ఆడాలనుకున్నప్పుడు ఆ ఆటకి సంబం ధించిన సూత్రాలు మొదట నీకు తెలిసుండాలి. దెబ్బ కొట్టడం, దెబ్బ కాచుకోవడమే కాదు దెబ్బ తగిలితే తట్టు కోవడం కూడా నేర్చుకోవాలి. ఎవర్నీ నమ్మకు. నమ్మినట్లు కనిపించు చాలు. దేనిలోనైనా సరే నీకు నష్టం జరుగు తుందని అన్పించినప్పుడు, తక్కువ నష్టంతో వెనక్కి రావడం ఎలాగో తెలుసుకో,'' అంది ఒకసారి వినీతా రాథోడ్. మధ్యతరగతి సంకోచాల్ని వదులుకుంటే తప్ప, హైక్లాస్ సొసైటీలో రాణించటం కష్టమని, ఎప్పటి కప్పుడు మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలని, ఆమె చెప్పిన మాటల్ని చిత్రకళ ఎప్పుడూ మర్చిపోదు. మన చిరునవ్వును, అందాన్నీ చూపితే మోజు పడతారే తప్ప, మన మనసు గాయాల్ని చూపితే బాధపడి, బాధ్యత తీసుకునే వాళ్లెవరూ వుండరన్న సత్యాన్ని, ఆటాడే క్రమంలో, పడి లేస్తూ తన స్వంత అనుభవంతో నేర్చు కుంది చిత్ర. ఆర్థిక స్థితి, మంచి ఉద్యోగం వల్ల మనకి సమాజంలో గౌరవం, హోదా ఆపాదించబడతాయని తెలుసు కాబట్టే, చిత్రకళ ఏదోక ఉద్యోగం చేయటం ఎప్పుడూ మానేయలేదు. ఒకప్పటిలా కాదిప్పుడు. ఏం చేయాలో వద్దో ఎంచుకోగల స్థిమితం అన్ని రకాలుగా తనకి వచ్చినట్లనిపిస్తుంది చిత్రకి.

చిత్రకళ ఇంటికి చేరుకునేసరికి ఏడు కావస్తోంది. వర్షం వెలిసింది. తడిసిన మొక్కలు మరింత పచ్చగా అగపడుతున్నాయి. కాఫీ కలుపుకొని మెల్లిగా తాగుతూ బాల్కనీలో నిలబడి, తడిసిన ఆకుల నుండి చినుకుల్ని రాలుస్తున్న పారిజాతపు చెట్టును చూస్తుంటే, తనకి ఎందుకో హఠాత్తుగా నాన్న గుర్తుకొచ్చాడు. ఇంట్లో వాళ్లు, ముఖ్యంగా అమ్మా, మావయ్యలూ తన విషయమై గొడవచేశారు కానీ, నాన్న ఎక్కువగా మౌనం గానే వున్నాడని ఎందుకో అనిపించింది చిత్రకి. బహుశా, తన జీవితం తనది అని ఆయన ఒప్పుకున్నాడేమో తెలీదు. తెల్లటి దేహంతో నేలను ముద్దు పెట్టుకుంటూ నారింజరంగు చేతుల్ని ఆకాశంకేసి చాచి ఆ దేవుణ్ని ప్రార్థిస్తున్నట్లున్నాయి రాలిన పారిజాతపు పూలు. ఆయన ఎంతో ఇష్టంగా తనకి చిత్రకళ అని పేరు పెట్టాడు. చిన్నప్పుడు నాన్న తనకి బొమ్మలేయటం నేర్పటం గుర్తొచ్చింది. రకరకాల రంగులు తెల్లటి కాగితంపై పరుచుకొని, అందమైన బొమ్మలుగా మారటం ఎంతో అద్భుతంగా వుండేదామెకి. తను బొమ్మలేస్తుంటే, చేతుల్లోంచి కాగితాలు లాగేసి, 'ఎందుకీ బొమ్మలు, కూటికొచ్చేనా గుడ్డకొచ్చేనా,' అంటూ అమ్మ తననీ, నాన్ననీ తిట్టడం కూడా గుర్తుంది చిత్రకి.

'ఇంతకీ నేను పులిని స్వారీ చేయడం నేర్చు కున్నానా?' అని తనని తాను ప్రశ్నించుకుంది చిత్ర.

సరసకి అలాంటి విద్యొకటి ఉందన్న విషయం కూడా తెలిసుండదు. కనిపించిన వాడినల్లా గుడ్డిగా నమ్మటం తప్ప ఏమీ తెలీదు.

''గీ పోరగాల్లను పుట్టించే పని దేముడు మన ఆడోల్లకే ఎందుకు బెట్టిండో తెల్వదు. అదే లేకుంటే

మన బత్కు ఇంత అన్నాలం లేకుండు. మన తాన పైస లేకపాయె, పవరు లేకపాయ ఇగ ఆగమాగంగాక ఏమైతమమ్మ," అంటూ చిత్రంగా నవ్వింది యాదమ్మ. పులి ఆమెను మింగేందుకు వాడే సాధనాలన్నిటినీ ఆమె ఒక్క తాపు తన్నినట్లనిపించింది చిత్రకళకి.

దూరంగా హాల్‌లో నుండి సెల్‌ఫోన్ మోగుతోంది. ఎత్తి మాట్లాడాలనిపించక దానికేసి అలాగే చూస్తోంది. రెండు మూడుసార్లు మోగాక, చిన్న చప్పుడుతో మెసేజ్ వచ్చింది. అప్పుడు మెల్లిగా ఆ మెసేజ్‌ని తీసి చూసింది చిత్ర. సునీతా రాథోడ్ నుండి. 'రాత్రి నోవాటెల్‌కి వస్తున్నావ్ కదా! లెటజ్ హావ్ గ్రేట్ ఫన్,' అనుంది.

తనకెందుకో పులిస్వారీ ఆటలో అది తనని తినేయకుండా కాచుకొని, కాచుకొని అలసిపోయినట్లనిపించింది. ఎంతో నిస్సత్తువగా కూడా వుంది. పర్సు తీసుకొని, ఇంటికి తాళం వేసి కిందికి దిగి వెడుతుంటే, కారు తలుపు తీసి పట్టుకొని, డ్రైవరు పిలిచాడు. అతడ్ని ఇంటికి వెళ్లిపొమ్మని చెప్పి, వీధిలోకొచ్చింది చిత్ర. ఆగి ఆగి కురుస్తున్న ఆ సన్నటి వానచినుకుల మధ్య నడుస్తూ, వీధి చివరనున్న స్టేషనరీ షాపు కెళ్లింది. డ్రాయింగ్ షీట్లు, రంగులు, బ్రష్‌లు కొనుక్కొని, ఇంటికి తిరిగి వస్తుంటే చిత్రకళ కెందుకో శాంతంగా అనిపించింది.

*సారంగ అంతర్జాల పత్రిక, డిసెంబర్ 2014*

